# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER - 2018

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

క్రీస్తు సంఘములు నిర్వహించుచున్న

# POLISHING THE PULPIT అను

## గొప్ప బైబిలు లెక్చర్‌షిప్

| | | |
|---|---|---|
| సమయము | : | 2018 డిశంబరు 2వ తేదీ ఆదివారము నుండి 6వ తేదీ శుక్రవారము వరకు<br>ఉదయం 10 గంటలకు<br>మధ్యాహ్నం 2 గంటలకు మరియు<br>రాత్రి 6.30 ని॥లకు |
| స్థలం | : | సత్యవాణి - క్రీస్తు సంఘము<br>రామారావుపేట, కాకినాడ |

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్వదేశీ, విదేశీ సువార్తికులు వాక్యోపదేశము గావించెదరు. ప్రతి దినము స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడును. దూరము నుండి వచ్చు వారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. మొదటి రోజున 40/-లు మాత్రమే చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను. ప్రతి సువార్తికుడు, స్థానిక సంఘ సభ్యుడు, సభ్యురాలు తప్పక పాల్గొనవలెను. ఇది అత్యంత అరుదైన తరుణము. తప్పక వచ్చి, ఆత్మీయ లాభము పొందండి.

వివరములకు దిగువ నీయబడిన నెంబర్లను సంప్రదించండి.


రిక్కీ గూటం

రోనీ గూటం

రాబిన్ గూటం

Ph : 0884 - 2363722

98489 98547, 99122 86255, 95021 84284

సత్యవాక్యు
THE WORD OF TRUTH
P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
JOSHUA GOOTAM
Pleading for Restoration of First Century Christianity
సంపుటి - 40 అక్టోబర్ - 2018 సంచిక -3

# నయమాను నుండి ఒక పాఠము

## ( A Lesson from Naaman )

పాతనిబంధనలో 2వ రాజుల గ్రంధము అయిదవ అధ్యాయములో సిరియా దేశపు సైన్యాధిపతియైన నయమానును గూర్చి వ్రాయబడి యున్నది. అతడు మహాపరాక్రమ శాలియై యుండెను గాని అతడు కుష్ఠరోగి. తన రోగమును బాగు చేసికొనుటకు నయమాను పలు ప్రయాసములు పడెను గాని అతడు బాగుపడలేదు. అయితే ఇశ్రాయేలు దేశపు చిన్నది ఒకతె అతని భార్యకు పరిచారము చేయుచు, ఇశ్రాయేలు దేశములో దేవుని ప్రవక్త ఒకడున్నా డనియు, అతడు తన యజమానుని కుష్ఠరోగము బాగుచేయుననియు చెప్పెను. నయమాను సిరియా దేశపు రాజు నుండి ఇశ్రాయేలు దేశపు రాజునకు ఒక పత్రిక వ్రాయించుకొని వెంటనే బయలుదేరెను. నయమాను ఇశ్రాయేలు దేశపురాజునొద్దకు వెళ్ళగా ఆ రాజు పత్రికను చదువుకొని మహా ఆగ్రహముగలవాడై సిరియారాజు అతనితో కలహమునకు కారణము వెదకుచున్నాడనెను. చివరకు నయమాను దేవుని ప్రవక్తయైన ఎలీషా యింటి ద్వారము ముందర నిలిచెను. ఎలీషా, నీవు యొర్దాను నదికిపోయి ఏడుమారులు స్నానముచేయుము, నీ

వాళ్ళు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక మనుష్యుని పంపెను. అందుకు నయమాను కోపము తెచ్చుకొని ప్రవక్త నాదగ్గరకు వచ్చి తన చెయ్యి ఆడించి యెహోవా నామమునుబట్టి నా రోగమును మాన్పునని అనుకొంటిని. ఇశ్రాయేలు దేశములోయున్న యొర్దాను నదికంటె సిరియా దేశపు నదులు శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానము చేసి శుద్ధుడను కాలేనా? అని అనుకొని రౌద్రుడై తిరిగి వెళ్ళిపోయెను. అయితే అతని దాసులలో ఒకడు అతనితో, ఆప్రవక్త యేదైన ఒక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్ము అను మాట దానికంటె మేలుకదా? అని చెప్పినపుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను.

నయమానును గూర్చిన సంగతి దృష్టాంతముగా అతనికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగు నిమిత్తము వ్రాయబడెనని 1 కొరింధి 10:11 వలన మనము తెలిసి కొనగలము. అయితే సిరియా దేశపు సైన్యాధిపతియైన నయమాను నుండి ఈ రోజు మనమేమి నేర్చుకొనగలము?

**రోగమును గ్రహించాలి :**

నయమాను ఎంత మహా పరాక్రమ వంతుడైనను తాను కుష్ఠ రోగియని గ్రహించెను. శుద్ధి చేయబడుట కాశించెను. నేటి మానవుడు కూడ ఎంతటి వాడైనను తాను పాపము రోగముతో బాధ పడుచున్నానని గ్రహించువరకు దాని నుండి విమోచనను పొందలేడు. అందరును పాపము చేసినవారే. దానిలో ఏ భేదము లేదు. గాని మానవుడు తాను నశించిన స్థితిలో యున్నాడనియు, తనకుగా తాను రక్షించుకొనజాలని స్థితిలో యున్నాడనియు, గ్రహించవలెను.

నయమాను యొక్క కుష్ఠ రోగమును బాగుచేయగల యెహోవా దేవుని శక్తిని గూర్చి చెరకొని పోబడిన

ఒక బాలిక యెరిగి దానిని ప్రకటించెను. యేసుక్రీస్తు సువార్తలో దేవుని శక్తి యున్నది. యేసునందు నమ్ము ప్రతివానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది. అయితే ఈ శక్తిని యెరిగిన ఎంతమంది దానిని చాటించుచున్నారు? బహు కొద్ది మందియే గదా. క్రీస్తు శిష్యుడైన ప్రతివాడును, అతడు ఎక్కడ ఉన్నను సరే, పరిస్థితులు అనుకూలముగ యున్నను లేకపోయినను సరే సువార్తను ప్రకటించవలసి యున్నది. అవును మానవుల పాపపురోగమును బాగుచేయగలవాడు ఒకే ఒక్కడున్నాడు. ఆయనే యేసుక్రీస్తు. ఆయన దగ్గరకు మనము అనేకులను తీసికొని రావలసి యున్నది.

**సరియైన స్థావరము :**

సిరియాదేశపు రాజు నయమానును యెహోవా దేవుని ప్రవక్త దగ్గరకు కాక ఇశ్రాయేలు రాజు నొద్దకు, అంటే కాని ప్రదేశమునకు కుష్ఠరోగము నుండి బాగు చేయబడుటకు పంపించెను. నయమానైతే సరియైన మనస్తత్వము కలిగి, నమ్మిక కలిగి, తన్ను తాను తగ్గించుకొని ఇశ్రాయేలు రాజునొద్దకు వెళ్ళెను. అయితే ఏమిజరిగెను? కుష్ఠ రోగమును బాగుచేయువాడు రాజు కాదు గనుక నయమాను యొక్క రోగము అతనినే అంటిపట్టుకొని యుండెను.

యేసుక్రీస్తు నామమున తప్ప మరెవరి నామమందును రక్షణ లేదను సత్యమును నిజక్రైస్తవులు బోధించుచుండగా అనేకులు తమ పాపవిముక్తి కొరకు కాని ప్రదేశములకు వెళ్ళి పూజలు, మ్రొక్కు బడులు, స్నానములు చేసి వచ్చు చున్నారు, గాని వారికి పాపవిముక్తి కలుగుటలేదు.

చివరకు నయమాను సరియైన వ్యక్తి దగ్గరకు అంటే దేవుని ప్రవక్త దగ్గరకు వెళ్ళెను గాని అప్పటికి అతని మనస్తత్వము మారిపోయెను. అతడు శుద్ధినొంద గోరుచుండెను గాని అతని మాట ప్రకారము, తలంపులు ప్రకారము ఆ శుద్ధీకరణ చేయబడ వలెనని నిశ్చయించుకొనెను. వెళ్ళి యోర్దాను నదిలో ఏడు మారులు

స్నానము చేయమని అతనికి తెలియ జేయబడగా నయమాను మహారౌద్రుడై తిరిగి వెళ్ళిపోయెను. అనేకులు దేవుని వాక్యమును అలకించుటకు ఈనాడు ఇష్టపడుచున్నారు గాని నమ్మినీటిలో ముంచడము బొందండి అని వారికి చెప్పుసరికి నయమానువలె మహా రౌద్రులగుదురు. అట్టి ఆగ్రహముతో నయమాను వెళ్ళిపోయిన యెడల అతని కుష్ఠరోగము అతనిని విడిచి పోయెడిదా? కానేకాదు. క్రీస్తు ఆజ్ఞలకు లోబడకుండా అవిధేయత చూపువారి పాపములు వారిని విడిచి వెళ్ళునా? అట్లు కానేకాదు. అందుకే మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు అని యేసు చెప్పు చున్నారు (లూకా 13:3).

యొర్దానునదిలో ఏడుమారులు స్నానము చేయుమని చెప్పగా నయమాను ఏమని గొణుగుకొనెను? యొర్దాను నది కంటే సిరియాదేశపు నదులు మంచివికావా? వాటిలో మునిగి శుద్ధుడను కాలేనా? అని తన కోపమును వ్యక్తపరచెను. అంతేకాదు, కోపముతో తిరిగి వెళ్ళెను. అయితే తన కుష్ఠరోగముతోనే తిరిగి వెళ్ళెను. నయమాను బుద్ధి తెచ్చుకొని ఎలీషా ప్రవక్తద్వారా దేవుడు అతని కాజ్ఞాపించినట్లు అతడు చేయు వరకు అతని కుష్ఠరోగమతనిని విడువనే లేదు.

**దేవుడు గొప్పకార్యములు కోరుటలేదు:**

పాపము నుండి విముక్తి నొంది మానవులు రక్షింపబడవలెనంటె మన నుండి దేవుడు గొప్ప కార్యములను ఏమి కోరుటలేదు. యేసును నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడుము అని ఆయన మనకు ఆజ్ఞాపించుచున్నారు (మార్కు 16:16). అయితే నయమాను వలె బాప్తిస్మము పొందితేనే రక్షింప బడుదునా? ఆయా దేవతలకు రాళ్ళకు రప్పలకు మ్రొక్కి రక్షింపబడలేనా? అని అనుకొనుచున్న యెడల పాప విమోచన లభించుట దుర్లభము. మరల యేసు చెప్పిన ఆజ్ఞను విని విశ్వసించుదును గాని బాప్తిస్మము పొందను అని అనుకొనుచున్న యెడల మన పాపముల నుండి రక్షింపబడలేము. నయమాను ఎలీషా ప్రవక్తద్వారా వినిన మాటలను

హృదయ పూర్వకముగా విశ్వసించి తన జీవితకాలమంతయు యొర్దాను నదిలో ఏడు మారులు స్నానము చేయకుండిన యెడల అతడు కుష్ఠు రోగమునుండి శుద్ధుడైయుండునా? అట్లు కానేకాక పోవును.

**అహంకారము పనికి రాదు :**

నయమానువలె యొర్దాను నదికంటె సిరియాదేశపు నదులు శ్రేష్ఠమైనవి కావా? యని తలంచేవారు, అట్లు బోధించేవారు మన మధ్య లేక పోలేదు. బాప్తిస్మమనగా నీటిలో సంపూర్తిగా ముంచబడుటయను సత్యమును దేవుని వాక్యము నుండి వేము బోధించు చుండగా, ముంచడము కంటె చిలకరింపు, కుమ్మరింపులు మంచివికావా? యని వాదించుచు నయమానువంటి మూర్ఖత్వమును ఇప్పటికింకా కొందరు బయలు పరచుచున్నారు. క్రీస్తే సంఘమును తన స్వరక్తమిచ్చికొని రక్షించినవాడు; సంఘము ఆయనదే గాని మరొకరిది కాదు. రక్షింపబడు నిమిత్తము క్రీస్తుసంఘములో నీవుండ వలసినదను సత్యమును వేము బోధించుచుండగా, క్రీస్తు సంఘము కంటె మతశాఖలు, మానవ కల్పిత సంఘములు మంచివికావా? యని ఇంకను అనేకమంది వాదించు చున్నారు. అంతేకాదు క్రీస్తు నందు విశ్వసించగానే నీవు రక్షింపబడితివి గనుక రక్షింపబడితివని నిరూపించుట కొరకు బాప్తిస్మముపొందుము అని కాని మార్గమునకు నడుపు ప్రజలు ఇంకా మనమధ్య ఉన్నారు. నయమాను, నీ కుష్ఠరోగము బాగైపోయినది గనుక యొర్దానులో ఏడుమారులు స్నానము చేయుము అని మాత్రము ప్రవక్త అతనికి చెప్పలేదు.

నీవు పోయి యొర్దాను నదిలో స్నానము చేసినయెడల నీ కుష్ఠరోగము పోవును అని నయమానుకు ఆజ్ఞాపించబడెను. మనలనైతే లేచి యేసునామమున ప్రార్ధనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడుగుకొనుమని అపొ.కా. 22:16లో ఆయన ఆజ్ఞాపించుచున్నారు. నయమానువలె నిన్ను నీవు తగ్గించుకొని, దేవుని ఆజ్ఞలకు సంపూర్తిగా లోబడినవాడే క్రీస్తు నిన్ను నీ పాపముల నుండి రక్షించును.

# పరీక్షింపబడిన యోబు

## ( Job is Tested )

(యోబు 1, 2 అధ్యాయములు)

**యోబు యొక్క ప్రవర్తన :**

యోబు గ్రంథము యొక్క మొదటి వచనములోనే అతనిని గూర్చి చెప్పబడింది. అతడు యదార్థ వర్తనుడు, న్యాయవంతుడునై యుండెను. అనగా అతడు నిందా రహితుడు. అతడు దేవుని యందు భయభక్తులు గలవాడు, చెడుతనమును విసర్జించిన వాడు. అతడు పాప రహితుడు గాను, పరిపూర్ణము గాను యున్నవాడు కాదు గాని అట్లుండుటకు ప్రయత్నించాడు. మానవులలో ఎవడును నేడు పరిపూర్ణుడు కాడు (రోమా 3:10,23). అయినను పాపులందరికీ యేసు రక్షకుడై యున్నారు. వారాయనకు విధేయులైతే రక్షింపబడుదురు (హెబ్రీ 5:9,10).

యోబు తన కుమారులు పాపము చేసిరేమోయని వారి నిమిత్తము ప్రతి అరుణోదయము నందును దహనబలి అర్పించేవాడు. దీనిని బట్టి అతడెంత భక్తిగలవాడో గ్రహించు కోగలము. అతనిది మచ్చలేని ప్రవర్తనయై యుండెను. దైవారాధన అతనికున్న అలవాటు. యోబును ఈ విషయాల్లో అనుకరించుట మన కెంతయో మేలు.

**యోబు నైతిక పరిపక్వత గలవాడు :**

అతని జీవితమంతటిలోను గొప్ప విశ్వాసము, నిష్కాపటము అతడు కనుబరచాడు. అతడు న్యాయవంతుడు. అతడు నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలుపొందలేదు. అతడు భక్తిపరుడు, పాపముకు వ్యతిరేకి (ఎఫెసీ 5: 11). తన కాలమునాటి వారి వలెగాక యోబు అటు దేవుని వలనను, ఇటు మనుష్యుల వలనను మెప్పుపొందిన వాడు. క్రైస్తవులమైన మనము యోబు యొక్క ఈ లక్షణమును తప్పక అనుసరించాలి. మనవలె అతడు నైతిక మానవుడే. గనుక మన సహచరుల యొద్ద యోబు వంటి ప్రవర్తన కలిగి యుండుట కష్టము కానేకాదు. దేవుని యెదుట కూడ యోబు లాంటి ప్రవర్తన మనము కలిగి యుండాలి.

యోబు 1:2,3లో యోబు యొక్క విస్తారమైన సంపదను గూర్చి చెప్పబడినది. ధనవంతులై యుండి పాపము చేయుటకు ఆస్కారము కలిగి యున్నను అబ్రాహాము వలె అతడు ధనవంతుడైనను దైవభీతి కలిగి యుండెను (మత్తయి 19:24, 1తిమో 6:10,17). పాశ్చాత్యదేశములలో యున్న ధనికులైన క్రైస్తవులు, ధన హీనులైన వారిని తలంచుచు దైవ భీతి కలిగి జీవించాలి.

**పరలోకములో జరిగిన సభ :**

దేవదూతలు యెహోవా సన్నిధిని సమావేశమైన ఒకనాటి నుండి యోబు యొక్క దురదృష్టము ఆరంభమాయెను (యోబు 1:6, 38:7). అపవాది అనే నిందలు మోపు సాతాను కూడ ఆనాడు అక్కడ ప్రత్యక్షమాయెను. దేవుని దూతలు వారి పరిచర్యను గూర్చి వివరణ యిచ్చుటకు అక్కడ యుండిరి (హెబ్రీ 1:14). ఆ దినమున అపవాది, భూమి మీద అటు యిటు తిరుగుచు యెహోవా యొద్దకు వచ్చెను (యోబు 1:6-7). "మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవని మ్రింగుదునా అని వెదకుచు తిరుగు చున్నాడని" అందుకే పేతురు మనలను హెచ్చరించాడు (1 పేతరు 5:8).

అప్పుడు యెహోవా నీవు నా సేవకుడైన యోబు సంగతి ఆలోచించితివా? అతడు యధార్థ వంతుడు, న్యాయవంతుడు, భూమి మీద అతని వంటి వాడెవడును లేడని చెప్పెను. సాతాను మోపు నిందలకు ప్రతిగా దేవుడిట్లు చెప్పెను. చరిత్ర యంతటిలోను దుర్మార్గులైన ప్రజలు అనేకులు లేకపోలేదు. అయితే యోబు తన స్వార్థము నిమిత్తమై దేవుని యందు భయభక్తులు కలిగి యుండెనని అపవాది పలికెను. అపవాది రెండు విధములుగా దేవుని పైన యోబు పైన కూడ నిందమోపజూపెను. దేవుడు యోబును అమితముగా ఆశీర్వదించారు, అందువలన అతడు ఆయనకు నమ్మకముగా యున్నాడనునది సాతాను యొక్క ఉద్దేశ్యము.

యోబు యొక్క నీతి యదార్థత లను అపవాది కాదనలేదు. యోబు యొక్క ప్రముఖ విమర్శకులు కూడ అట్లే పదేపదే నిందపమోపజూపారు. అయితే యోబు యొక్క ప్రవర్తన అంత

పవిత్రము కాదని నిందా యోగ్యమైనదని అపవాది యొక్క వాదన అయ్యుండెను.

యోబు పై ప్రయోగము చేయుడానికి దేవుడు సాతానకు ఎందుకు సెలవిచ్చెను? ఈ దృశ్యములో దేవుడు తన సేవకుని యెడల కలిగిన ప్రేమను గూర్చియే గాని ఆయన సాతాను కోరికను మన్నించుటకు కాదు. మానవుని క్షేమార్ధము యెహోవా సాతాను సవాలును స్వీకరించారు. దుర్లాభాపేక్ష కాదు గాని నీతి యదార్ధతలున్నవని నిరూపించు నిమిత్తము ఆయున యోబు నిశితముగా పరీక్షింపబడుటకు ఒప్పుకొన్నారు. అందువలన యోబు యొక్క ప్రాణము తప్ప అతనిని శోధించుట కాయున అపవాదికి అవకాశమిచ్చారు.

**యోబు యొక్క దురదృష్టము, దృశ్యము నెం.1 (1:13-19)**

యోబు అకస్మాత్తుగా ధన శిఖరము, ఆరోగ్య భాగ్యముల నుండి ధన హీనునిగాను, రోగిగాను తయార య్యెను. యోబును మానసికముగా కూల్చుడానికి అపవాది వివిధ విపత్తులు త్వరితగతిని అతనికి సంభవించునట్లు చేసెను. వరుసగా త్వరితగతిని సంభవించిన విపత్తులలో అతడు ధనహీనుడ య్యాడని, ప్రకృతి విపత్తుల వలన ఆర్ధికంగా అతడు తుడిచి వేయబడ్డాడని అతని పదిమంది బిడ్డలు ప్రాణాలు కోల్పోయారని అతని తెలియజేయ బడింది.

13వ వచనము ఆరంభము నుండి ప్రతి విపత్తుకు ముందు సర్వ సాధారణ పరిస్థితులుండెను. ప్రతి విపత్తు అకస్మాత్తుగా, హెచ్చరిక ఏదియు లేకయే సంభవించెను (మత్తయి 24 : 30 - 44). షెబాయీయులు (15వ), కల్దీయులు (17వ) నేటి పితరుల కాలము చరిత్రలో యుండే దోపిడీ దొంగలు. తదుపరి వారు షేబా (యెమెన్) దేశముగాను బబులోను దేశము గాను ఆవిర్భవించిరి. దేశము నాటి కాలపు బబులోను దేశము ఇరాక్ దేశములో ఒక భాగమై యున్నది.

16వ వచనములో ఆకాశము నుండి అగ్ని వచ్చి యోబు యొక్క గొర్రెలను పనివారిని తగులబెట్టి కాల్చి వేసినట్లు వివరించబడినది. 19వ వచనములో గొప్పసుడిగాలి వచ్చి అతని యింటిని నాలుగు మూలలను

కొట్టగా ఆ యిల్లు యౌవనులమీద పడి వారందరు చనిపోయినట్లు వివరించు చున్నది. ఈ విపత్తులలో రెండు దుర్మార్గులైన మనుష్యుల వలన సంభవింపగా, రెండు ప్రకృతి శక్తుల వలన సంభవించెను. దేవుని హద్దులలో యుండు సాతానుడు దుష్టులను, ప్రకృతిని వినియోగించి యోబును హింసించెను.

**యోబు యొక్క స్పందన : (యోబు 1:20-22)**

అట్టి ఘోరవిపత్తు సంభవిస్తే మనమెట్లు స్పందించెదమో అట్లే యోబు కూడ స్పందించాడు. అయినను మనమెట్లు స్పందిస్తామో మనకే తెలియదు. ఏలయనగా యోబులాంటి విపత్తులను అకస్మాత్తుగా మనం ఎవరము ఎదుర్కొని యుండము. "యోబు లేచి తనపై వస్త్రమును చింపుకొని తల వెండ్రుకలు గొరిగించుకొని నేలమీద పడి సాష్టాంగ నమస్కారముచేసి ఇట్లనెను : నేను నా తల్లిగర్భములో నుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడకి తిరిగి వెళ్లెదను. యెహోవా యిచ్చెను. యెహోవా తీసికొనిపోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగును గాక" (యోబు 1:21). ఈ విశ్వాధిపతికి అతడు తన్నుతాను అప్పగించుకొనెను. యోబు యెడల దేవుని నమ్మకమును యోబు వమ్ముచేసికొనలేదు. సాతాను యొక్క కుతంత్రము బెడిసికొట్టెను. అత్యంత విలువైన భక్తిని అతడు కనుబరచెను. దానికి వెలకట్టలేము.

అత్యంతక్లిష్టమైన కష్టములు యోబును దేవునివైపు మళ్లించెను. ఆయన నుండి దూరమవుట గాక అతడాయన నారాధించుటకు నడిపించెను. అందువలన భౌతిక సంబంధమైన దీవెనలను బట్టి గాక, ధన సంపత్తిని బట్టిగాక యోబు ఆత్మీయముగా దేవునితో బంధింపబడి యుండెను. యోబు 1:1ని ప్రసంగి 5:15 మరియు 1 తిమోతి 6:7తో పోల్చిచూడుము.

మొదటి ముగ్గురు వర్తమానికులు తెచ్చిన వార్తను యోబు సంభ్రమాశ్చర్య చకితుడై ఆలకించెను, ఇప్పడతని కుమారుల యొక్కయు కుమార్తెల యొక్కయు మరణ వార్తను విని తన హృదయాంతర్భాగములలో నున్న దుఃఖభావములను వెల్లడిపరచెను. ఈ విషయములలో

దేనియందును యోబు ఏ పాపమును చేయలేదు, దేవుడు అన్యాయము చేసెనని చెప్పలేదు" (యోబు 1:22). సరిగదా సాతాను తలంచినట్లు అతడు దేవుని దూషించలేదు గాని ఆయన నామమును మహిమపరచెను. అనేకుల వలె అతడు దేవునిపై నిష్టూరము వేయ లేదు, దేవుని నిందించలేదు.

**పరలోక కూటము : (యోబు 2:1-6).**

యోబు యొక్క ప్రవర్తనను గూర్చి దేవుడు మరియొక సారి ఆయన తన హర్షమును తెలియజేసెను, అపవాదిని ఆయన నిందించెను. అయితే దేవుని యెదుట రెండవసారి దర్శనమైన అపవాది యోబుకు సంభవించిన పరీక్ష అంత కఠినమైన దేమికాదని తెలిపెను. ఒక మనుష్యుడు తన ప్రాణమును రక్షించుట కొరకు తనకున్న సమస్తమును సమర్పించునని అతడు వాదించెను. అందువలననే యోబు దేవుని యెడల నమ్మకముగా యుండెనని, శారీరకముగా అతడు హింసింపబడిన యెడల యోబు దేవుని శపించునని సాతానుడు వాదించెను.

యెహోవా దేవుని యొక్కయు సాతాను యొక్కయు ఉద్దేశ్యములు వేర్వేరు. యోబు యొక్క విశ్వాసము పరిపకత్వ మెందుటకు గాను దేవుడు యోబును పరీక్షించెను గాని అపవాదియైతే అతని విశ్వాసమును భంగపరచి అతని సంపూర్తిగా నాశనము చేయగోరెను.

**యోబు యొక్క దురదృష్టములు (2:7-10)**

యోబు యొక్క రోగమును గూర్చి ఇంత దూరము నుండి, ఇంత కాలము తరువాత అంచనా వేయుట కష్టము. అదేమైనను దాని వలన అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు అతనికి కురుపులు కలిగెను (2:7), అతని యొక్క ఆకృతిలో పోల్చుకోలేనంత మార్పు కలిగెను (2:12). భోజనము చేయలేకుండెను (3:24), అతని దేహము పురుగుల తోను, మట్టిపెల్లలతోను కప్పబడెను (7:5), అతనికి నెమ్మది లేకుండెను, సుఖము కానరాకుండెను (3:25). ఊపిరాడుట కష్టమాయెను (9:18), కనురెప్పలు కానరాకుండెను (16:16), నోటి దుర్వాసన సంభవించెను (19:17), బరువు

కోల్పోయెను (19:20), యెముకలు అరిగిపోయిన బాధ వలన నిద్రరాకుండెను (30:17)° మరియు అతని చర్మము నల్లబడి ఊడిపోవు చుండెను (30:30).

**యోబు యొక్క శ్రమలు సంపూర్ణము :**

అతడు ఆర్థికముగా కృంగి పోయెను, మహావేదన దు:ఖము అతనికి సంభవించెను, ఆరోగ్యము పూర్ణముగా క్షీణించెను. అది చాలనట్లు తన భార్య యొక్క ఆదరణనతడు కోల్పోయెను, యెబు ఘోరమైన వ్యాధిగ్రస్థుడయ్యెను, చావ సిద్ధమయ్యెను; అయినను అతని ఆత్మ దేవుని యెడల కృతజ్ఞత కలిగి యుండెను. శ్రమలు సంభవింపగా దేవుని విడిచి పెట్టాలనెడి భావమును యోబు భార్య వలె నేడును అనేకులు కలిగి యున్నారు.

మరొక ప్రక్కను యోబు యొక్క భార్య ఆత్మీయముగా ఎదిగిన వ్యక్తి వలె అగుపడదు. ఆదాము భార్యయైన హవ్వలాంటి మనసత్త్వము ఆమెది. అందువలన దేవుని బిడ్డయైనవాడు ఆత్మీయ విషయాల్లో తనకు సహకరించే వ్యక్తిని వివాహమాడుట అత్యవసరము.

అయినను యోబు భార్యకూడ తన భర్తతో కలిపి శ్రమలనుభవించె ననుది విదితమే. ఒక్కరోజులోనే వారు తమ సంపత్తినంతటిని కోల్పోయిరి. ఆమె జన్మనిచ్చిన పదిమంది బిడ్డలు అకస్మాత్తుగా మరణించిరి మరియు తన భర్త ఘోరమైన వ్యాధితో బాధనను భవించుట కూడ ఆమె అనుభవించెను. అతని బాధకు ఎవ్విధమైన విరుగుడును ఆమె అందించలేకపోయెను. బహుశా మరణమే యోబు యొక్క మానసిక, శారీరకబాధలను తుదముట్టించునని ఆమె నమ్మియుండెను. ఆమె భర్త పట్టు విడువకపోయినను, విశ్వాసములో సడలకపోయినను, ఆమె మాత్రము చితికిపోయెను, ఆమె విశ్వాసము క్షీణించెను. యోబు భార్యయొక్క విశ్వాస స్థాయిని సాతానుడు బహుశా సరిగనే అంచనా చేసెను. ఆమె అతనిని మానసికముగా హింసించు లాగున బహుశ ఆమెకు ఆయురారోగ్య ములుండులాగున చూచెను. యోబు బాధతో కూడిన నిరాశను తన భార్యను గూర్చి వెల్లడించెను. తన భార్య నుండి శ్రేష్టమైన సంగతులనతడు కోరుకొనెను.

యోబు స్వలాభాపేక్షను బట్టియై నీతిమంతుడై యుండెనని సాతానుడు నిందించినప్పుడు, యోబును గూర్చి వాడు పొరబడెను. గాని అతని భార్య యైతే తన విశ్వాసమును, నీతిని సుఖ సంపదలతో ముడివేసికొనినట్లు విశద మగుచున్నది. అందువలన ధనానికి బదులు దారిద్ర్యము సంభవించి నప్పుడు, సంతోష కాలములు పోయి విశాదము అలుముకొనినప్పుడు ఆమె విశ్వాసము సన్నగిలెను. నేడు మనం విశ్వాసములో ఎవరిని అనుకరింతుము? యోబునా లేక అతనిభార్యనా? దీనియంతటిలోను దేవుని అను గ్రహమును కటాక్షమును యోబు గ్రహించకపోయినను యోబు తన విశ్వాసమును కాపాడుకొనెను. “ఈ సంగతులలో ఏ విషయమందును యోబు నోటిమాటతోనైనను పాపము చేయలేదు” (యోబు 2:10).

ఆ దృశ్యము యోబు శారీరక బాధతో కుమిలిపోవుచు ఒంటరిగా కూర్చుని యున్న చోటికి మారెను. అతడు ఒళ్లుగోకు కొనుటకై చిల్లపెంకు తీసికొని బూడిదెలో కూర్చొనెను (2:8). యోబు యొక్క మిత్రులనబడే వారు అతనిని అట్టి పరిస్థితిలో కనుగొనిరి.

**యోబు యొక్క మిత్రులు (2:11-13).**

యోబు యొక్క ముగ్గురు మిత్రులు అతని ఓదార్చు నిమిత్తము అతని యొద్దకు వచ్చిరి. మొదట్లో వారు నిజంగా దు:ఖించుచున్నట్లు, సానుభూతిపరులుగా అగుపడిరి. అతని చూచివారు ఏడ్చిరి. తమ బట్టలు చింపుకొని దు:ఖమును వ్యక్త పరచిరి. వారు కూడ తమ తలలమీద బూడిద వేసికొని మనస్తాపము వ్యక్తపరచిరి (యెహోషువా 7:6; విలాప 2:10). వారు నిశ్శబ్ధముగా దీనావస్థలో యున్న యోబుతో సంభాషించిరి. ఇప్పటి వరకు అంతా బాగానే యున్నది. అతని మిత్రులు నిశ్శబ్ధముగా కూర్చునిన ఏడు రాత్రింబగళ్ళు 'ప్రలాపించుట' మృతి జెందిన వారి యెడల సంతాప సూచకము (ఆదికాండము 50:10ని చూడుము). యోబు చనిపోవునంతగా సోలి పోయెను. యోబు ఆత్మహత్య చేసి కోలేడు గనుక తనకు సంభవించిన దుర్దశము బట్టి మరణింతుననే నిశ్చయానికి తాను వచ్చియుండెను.

గొప్ప దు:ఖములో మునిగి యున్న వారిని ఓదార్చుటకు కొన్నిసార్లు మాటలు దొరకవు. గాని దు:ఖించు చున్నవారికి దగ్గరగా మనం ఉంటే అది వారికి పెద్ద ఓదార్పు. ఒక్కోసారి మౌనమే గొప్ప ఆదరణ.

అయితే ఈ ముగ్గురు మిత్రుల యొక్క మౌనము నిజానికి ఆదరణకు దూరమాయెను. సరిగదా వారి మౌనము ద్వారా వారి ఊహలలో యోబుచేసిన పాపములకు దేవుడు అతని శిక్షించుచుండెననే తలంపులు వారు కలిగి యుండిరి (44-45వ)

"ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధియెవడు? తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుక తీయక మన అందరికొరకు ఆయనను అప్పగించిన వాడు ఆయనతోపాటు సమస్తమును మనకు ఎందుకు అనుగ్రహింపడు? దేవుని చేత ఏర్పర చబడినవారి మీద నేరము మోపు వాడెవడు? నీతిమంతులుగా తీర్చు వాడు దేవుడే. శిక్షవిధించువాడెవడు? చనిపోయిన క్రీస్తు యేసే. అంతే కాదు మృతులలో నుండి లేచినవాడును దేవుని కుడిపార్శ్వమున ఉన్నవాడును మనకొరకు విజ్ఞాపనము చేయువాడును ఆయనే. క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను, కరువైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? ఇందును గూర్చి వ్రాయ బడినదేమనగా, నిన్ను గూర్చి దిన మెల్ల మేము వధింపబడినవారమైతిమి. వధకు తేబడిన గొర్రెలమని మేము ఎంచబడిన వారము. అయినను మనలను ప్రేమించిన వాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము.

"మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను. రాబోవునవియైనను, అధికారులైనను, ఎత్తైనను, లోతైనను సృష్టించబడిన మరి ఏదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:31-39).

- లూయిస్ రష్మోర్

# సిలువ బయలు పరచు వాస్తవములు

## ( Revelations from the Cross )

హెబ్రీ 12:1,2లో పౌలు ఇట్లు వ్రాసాడు : "ఇంతగొప్ప సాక్షిసమూహము మేఘము వలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతి భారమును సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడైన యేసు వైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు" (హెబ్రీ 12:1,2).

మనము ఈనాడు సిలువను వీక్షించిన యెడల కనీసము నాలుగు వాస్తవములు మనకు బయలు పరచ బడును.

మొదటిగా పాపము యెడల దేవుని తత్వమును సిలువ మనకు బయలుపరచును. పాపము ఒక ఏక్సిడెంటు అని మానవుడు తలస్తాడు. దేవుడు దానిని అసహ్యించుకొంటారు. మానవుడు దానిని ఒక తప్పిద మంటాడు, దేవుడు దానిని గ్రుడ్డితన మంటారు. మానవునికి అదొక బలహీనత గాని దేవుడు దానిని బుద్ధి పూర్వకమంటారు. "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును, ఆజ్ఞాతిక్రమమే పాపము" అందువలన పాపమును దేవుడు అసహ్యించు కొంటారు (1 యోహాను 3:4). "దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును" (యాకోబు 1:15). పాపమును నాశనము చేయు నిమిత్తము దేవుడు క్రీస్తు సిలువను వినియోగించారు. "అపవాది క్రియలను బయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (1 యోహాను 3:18).

రెండవదిగా తానున్న రీతిగనే పాపము మానవుని బయలుపరచును. సిలువ సందర్భములో మానవుడు తన మత సంబంధముసుకును తీసివేసి నరకమునకు పోవువానిగా అగుపడు చున్నాడు. అసూయచేత యూదులు యేసును అప్పగించిరని పిలాతు ఎరిగి యుండెను (మత్తయి 27:18). యేసును సిలువ వేయుమని వారానాడు బిగ్గరగా కేకలు వేసిరి (మత్తయి 27:28). యేసును సిలువవేసిన వారితో పేతురు, దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టుని చేత సిలువవేయించి చంపితిరి" యని చెప్పెను (అపొ.కా. 2: 23,24).

మూడవదిగా క్రీస్తుసిలువ దేవుని ప్రేమను మనకు బయలు పరచుచున్నది. అయినను దేవుని మరింత ఘనముగా మనము ఇక్కడ చూడ గలము. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచు చున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చని పోయెను" (రోమా 5:28). "అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినపుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను" (ఎఫెసీ 2:4). "యెహోవా దయాళు డు, ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును" (కీర్తన 136:1). దేవుడు ప్రేమయై యున్నారు (1 యోహాను 4:8).

చివరిగా మానవుని నిరీక్షణ యదార్థము కాగలదని క్రీస్తు సిలువ బయలుపరచుచున్నది. పాపక్షమాపణ నిమిత్తము మానవుని నిరీక్షణ యదార్థము కాగలదు. "దేవుని కృపా మహాదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు

కలిగియున్నది" (ఎఫెసీ 1:7). దేవునితో సమాధానము కలిగి యుండ వలెననెడి మానవుని నిరీక్షణ యదార్థము కాగలదు. కొలస్స 1:20లో పౌలు ఇట్లు చెప్పాడు. "ఆయన సిలువ రక్తము చేత సంధిచేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను, పరలోక మందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొన వలెననియు తండ్రి అభీష్టమాయెను". చివరిగా నిత్యవిశ్రాంతి కొరకున్న మానవుని నిరీక్షణ క్రీస్తు సిలువలో వాస్తవమాయెను "ఏలయనగా మన పౌరస్థితి పరలోకమందున్నది" (ఫిలిప్పి 3:20).

- జాన్‌స్టేసీ

## అందరు ఒకే చోటికి పోవుదురా?

### ( All are going to the some place? )

క్రైస్తవులమని చెప్పుకొనే వారిలో అనేకులు ఐక్యతను గూర్చి సుముఖము గానే యుందురు. మతసంబంధ నాయకులు కూడ ఐక్యతను గూర్చి తరుచు ఉపన్య సించుదురు. ప్రణాళిక లను ప్రచురింతురు. వారి ప్రయత్నము లు వెంటనే ఆవిరైపోయినను, అట్టి ఆలోచన కలిగియున్న వారు అభినంద నీయులు.

ఐక్యతను గూర్చి ఆలోచించే వారు సాధారణంగా సంఘీభావమును గూర్చియే తలంతురు. యూనియన్ వేరు, యూనిటీ వేరు. సంఘీభావము (యూనియన్) అనగా రెండు పిల్లుల తోకలను ముడివేసిన యట్లుండును. వాటి మధ్య కొంతసేపు సంఘీ భావమున్నను ఏకత్వముండదు. ఆయా సందర్భాలలో కొన్ని డినామినేషన్లు, అంతర్డినామినేషన్లు ఒకదానితో మరొకటి కలసిపోయినను, ఆ వార్త ప్రకటింపబడగానే వారి భేదాభిప్రాయ ములు బట్టబయలగును. అయితే నిజమైన ఐక్యత డినామినేషన్లకు చెందనట్టిదియని

మనము గ్రహించాలి.

**అందరు ఒకే చోటికి పోవుదురా?**

భక్తిపరులందరు ఒకే చోటికి పోవుదురని యభిప్రాయపడే వారిలో కూడ, వారిలో వారికి ఖరీదైన బిల్డింగులు, ప్రమాణపుస్తకములు, ప్రచురణాలయములు, ముద్రణలు, రక్షణను గూర్చిన విభిన్నమైన బోధలు, భిన్నమైన ఆరాధన విధానములు, భిన్నమైన నామములు కలిగి యుందురు. ఒకేవూరిలో వేర్వేరు చర్చి బిల్డింగులు వారు కట్టుదురు. చిన్న వూరైనా వేర్వేరుగా వారు కట్టుదురు. వారి ఐక్యత యదార్ధమైనదైతే వారందరికీ ఒక్క బిల్డింగు చాలును!

ఈ మతశాఖల బోధయేమంటే రక్షింపబడాలంటే ఒకడు ఏ సంఘ సభ్యుడు, చివరకు వారి సంఘసభ్యుడు కూడ కానక్కరలేదు. బైబిలుకు భిన్నమైన బోధలు చీలికలనేర్పరచును. అవి దేవుని పనికి అభ్యంతరకారణము లగును (లూకా 19:10; యోహాను 14:6; మత్తయి 28:18-20). ఈ భక్తి గల ప్రజలు మధ్యయున్న బేధముల వలన ఈ లోకము గజిబిజియగు చున్నది. వారి బోధలు స్వవిరుద్ధములు, సందేహాస్పదములు, నిజానికి యదార్ధ ఐక్యతను కోరుకొనువారికి మరణ కరములు. మన ప్రభువు తన శిష్యులను గూర్చి తండ్రికి ప్రార్థించి నప్పుడు ఇదేయభిప్రాయములను ఆయన కలిగి యుండెను. "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మన యందు ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించు చున్నానని" యేసు తండ్రి యైన దేవునికి ప్రార్థించెను (యోహాను 17:20, 21).

- గేరీ కోలీ

**YOU TUBE లో**
**Satyavanicockkd**
**అనే లింక్‌లో 24 గంటలు సత్యవాణి కార్యక్రమాలను వీక్షించండి**

# మనము ఋణస్థులము

## ( We are debtors )

రోమా 1:14-18లో అపో.పౌలు ఇట్లు వ్రాసాడు : "గ్రీసు దేశస్థులకును గ్రీసు దేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును, మూఢులకును నేను ఋణస్థుడను. కాగా నా వలన నైనంతమట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడు వాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగు జేయుటకు అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన - నీతి మంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాస మూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దాని యందు బయలు పరచబడు చున్నది."

గొప్ప అపోస్తులుడైన పౌలు తానొక ఋణస్థుడనని చెప్పుకొను చున్నాడు. అతడు జ్ఞానులకును మూఢులకును కూడ ఋణస్థుడై యున్నాడు. పౌలు ఏ రీతిగా వీరికి ఋణస్థుడైయున్నాడు? అతడు వారి యొద్ద అప్పుతీసికొని తిరిగి తీర్చలేదా? కాదు గాని పౌలు వారికి సువార్త బోధించుటలో ఋణస్థుడై యున్నాడు. అది నమ్ము వారిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది.

సువార్తను బోధించుటలో పౌలు మాత్రమే గాక క్రైస్తవులందరును. క్రీస్తు సంఘ సభ్యులందరును ఋణస్థులై యున్నారు. ఏలయనగా సంఘము సత్యమునకు స్థంభమును దాని ఆధారమునై యున్నది. సత్యము మనలను స్వతంత్రులనుగా చేయును

(యోహాను 8:32). గనుక మనుష్యులు సత్యమును తెలిసికొని దానికి విధేయులయ్యే వరకు పాపము నుండి స్వతంత్రులు కాలేరనునది విధితము. రోమా 6:17 ఇట్లు చెప్పుచున్నది : 'మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపముల నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి".

నిజానికి క్రైస్తవులు ఋణస్థులై యున్నారు. సర్వలోకమునకు సువార్త బోధించుటకు మనము ఋణస్థులమై యున్నాము. అంతేకాదు దేవుడు పక్షపాతి కాదని ఎరిగినవారమై అందరికీ సువార్త బోధింప బాధ్యులమై యున్నాము.

మొదటిగా తండ్రియైన దేవునికి ఆయన కుమారుడైన యేసుక్రీస్తుకు ఋణస్థులమై యున్నాము. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును రక్షింప బడునట్లు ఆయనను అను గ్రహించెను" (యోహాను 3:16). ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మన మాయనను ప్రేమించు చున్నాము (1 యోహాను 3:16). "అయినను దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచు చున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా 5:8).

క్రైస్తవులు ఒండొరులను గౌరవించి ప్రేమింప బాధ్యులు గనుక వారొకరికొరకు ఒకరు ఋణస్థులై యున్నారు. "నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనిన వారైయుండి యొకనినొకడు హృదయపూర్వకము గాను మిక్కుటముగాను ప్రేమించుడి"

(1 పేతురు 1:23). సహోదరులను ప్రేమించుడి యని వాక్యము చెప్పుచున్నది (1 పేతురు 2:17).

క్రీస్తు వధువైన సంఘమును గౌరవించుటకు మనము ఋణస్థులమై యున్నాము. లేఖనములను మనకిచ్చిన పరిశుద్ధాత్మకును, అపొస్తులులకును మనము ఋణస్థులమై యున్నాము. సత్యసువార్తికులకు, మంచి మాదిరి గల క్రైస్తవులకు మనము ఋణస్థులమై యున్నాము. యేసు ప్రభువు యొక్క వర్ణణాతీతమైన కృపకు మనము ఎల్లప్పుడు ఋణస్థులమై యున్నామని మరచిపోరాదు.

-జాన్‌హేరిం


## ఉచిత బైబిలు కోర్సు

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలు కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంధమును ఉచితముగా పొందండి. దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి.**

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ - 533 001.

ఫోన్ : 0884 - 2363722

# సంక్షిప్త వార్తలు

2018 సెప్టెంబరు నెల క్రీస్తుసంఘ చరిత్రలో ఒక ప్రాముఖ్యమైన ఘట్టము. ఆ నెల మొదటి తేదీన యూ ట్యూబ్ (YOU TUBE)లో సత్యవాణి యొక్క స్వంత ఛానల్ ప్రారంభించబడినది. జాషువా దంపతులు, రిక్కీగూటం దంపతులు వారి బిడ్డల సమక్షములో పాటలు పాడి, వాక్యపఠనము గావించి, ప్రార్థనతో ఆ ఛానల్ ప్రారంభించబడినది. ఇప్పుడు సత్యవాణి కార్యక్రమములను 24 గంటలు ప్రతిరోజు **You Tube** లో ప్రపంచములో ఎక్కడ వున్న వీక్షించవచ్చును.

**Satyavanicoc.kda** అనే లింకుతో మీకు సెల్‌ఫోన్లలోను, కంప్యూటర్లలోను ఈ కార్యక్రమములు లభ్యమగును. సెల్‌ఫోన్‌లో వచ్చు కార్యక్రమములను మీ టి.వి. కి కూడా కనెక్ట్‌చేసికొనవచ్చును.

ప్రతి క్రీస్తుసంఘ సభ్యుడు **Satyavanicoc.kda**లో కార్యక్రమములను చూచుటయేగాక యితరులకు కూడా వాటిని గూర్చి తెలియజేయమనవి. అటు తరువాత ఆ కార్యక్రమములకు క్రింద **Subscribe** అనే మాటను నొక్కితే భవిష్యత్తు కొరకు సహాయ కరముగా యుండును.

సత్యవాణి యూ ట్యూబ్ ఛానల్‌లో భవిష్యత్తులో హిందీలోను, తమిళంలోను, ఇంగ్లీషులోను కూడ ప్రసారము చేయబడును. ఔత్సాహికులైన క్రీస్తుసంఘ సువార్తికులు తమ కార్యక్రమములను ఈ ఛానల్‌లో కూడ ప్రసారము చేసికొనవచ్చును. దానికి ఖర్చు అట్టి వారికి బహుస్వల్పము మాత్రమే, గాని ఆ కార్యక్రమములు ప్రపంచవ్యాప్తముగా అనేకులు వీక్షించెదరు.

2018 సెప్టెంబరు 25వ తేదీ మంగళవారము నాడు సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో ప్రతి మంగళవారము జరుపబడు **"Fishers of Men"** అను ఆంగ్లకోర్సు ప్రారంభించబడినది. ఇంగ్లీషు వచ్చినవారు 15-20కి మంది మాత్రమే ఆ కోర్సులో ప్రవేశము కలదు. అమెరికా నుండి వచ్చిన సోదరులు టిమ్ విల్స్ **Jr.** గారు ఆ కోర్సును ఉపదేశించుచున్నారు. మొదటి రెండు వారములు ఆ కోర్సు విజయ వంతముగా కొనసాగినది. ఇంకా 9 వారములు మట్టుకు అది నడుపబడును.

2018 సెప్టెంబరు 18వ తేదీ మంగళవారము సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. పలు జిల్లాల నుండి వచ్చిన సువార్తికులు ఆ రోజు ఆహ్లాదకరమైన వాతావరణములో చక్కటి బైబిలు పఠనము గావిస్తూ, సహోదరులు ఉపదేశించిన వాక్యమును ఆస్వాదించిరి. అమెరికా నుండి వచ్చిన ఆస్టిన్ వెస్లీ గారు సంఘ పాలన పద్ధతిని గూర్చి చక్కగా ఉపదేశించిరి. రిక్కీ గారు పలు హెచ్చరికలు చేసిరి. డిశంబరులో కాకినాడలో జరిగే **Polishing the Pulpit** సభలను గూర్చి, జనవరిలో జరిగే **Lads to Leaders** కార్యక్రమములను గూర్చి సవిస్తరముగా వివరించిరి. 2018 డిశంబరులోను 2019 జనవరిలోను జరుగు అనేక సువార్త కార్యక్రమములను గూర్చియు, సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా జరుగుచున్న పలు సువార్త కార్యక్రమములను గూర్చియు ప్రార్థించ మనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd.No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.